ఉద్రికత్తం.....!
ఐదు గంటల తరువాత ప్రశాంతం...



2

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఖమ్మం

శుక్రవారం 6 నవంబర్ 2026 పేజీలు : 8

15 వేల ఎకరాల్లో పంట నష్టం!



ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు..

నీట మునిగిన వరి, పత్తి, మిర్చి పంటలు

తెగిపోయిన రింగ్‌బండ్..
జలదిగ్బంధంలో గ్రామాలు

వాగులు పొంగి రాకపోకలకు అంతరాయం..

పలువురిని రక్షించిన సహాయక బృందాలు

ఖమ్మం: మురసు తుపాను ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైంది. బుధవారం కురిసిన ఎడతెరిపిలేని వర్షాలకు వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. పొట్ట దశలో ఉన్న వరి పైరు నేలవాలి నీటిలో మునిగిపోగా, పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలకూ నష్టం వాటిల్లింది. ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లావ్యాప్తంగా సుమారు 15 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మరోవైపు వాగులు, వంకలు పొంగిపొర్లడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట, కొత్తగూడెం నియోజకవర్గాల్లో భారీ వర్షాలు కురిశాయి. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అశ్వారావుపేటలో అత్యధికంగా 25.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దమ్మపేట మండలం మల్కారంలో 18.7, అంకంపాలెంలో 14.8, ములకలపల్లిలో 14.6 సెంటీమీటర్ల వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా సగటున 9.25 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య తెలిపారు.



వరద విపత్తు పై అధికారుల చర్యలకు అభినందనలు

- మంత్రి పొంగులేటి
- ఎస్డీఆర్ఎఫ్ పటిష్టంతో సత్ఫలితాలు
- వరద సహాయక చర్యలు, నష్టం అంచనాలపై ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి

సత్తుపల్లి నవంబర్05(ప్రజా జ్యోతి)

వరద విపత్తుపై అధికారులు సమన్వయంతో తీసుకున్న చర్యలు, ప్రాణనష్టం లేకుండా చేపట్టిన చర్యలను రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందించారు. గురువారం సింగరేణి కాలరీస్ గెస్ట్ హౌజ్ లో బేతుపల్లి వరద సహాయక చర్యలు, వరద ముంపు నష్టాలపై ఉమ్మడి ఖమ్మం జిల్లాల కలెక్టర్లు, సత్తుపల్లి, అశ్వారావుపేట ఎమ్మెల్యేలతో కలిసి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి - మిగతా5లో



మురుగు కూపంగా మేడిదపల్లి!

మేడిదపల్లిలో పారిశుద్ధ్యం పడకేసింది!

వర్షం పడితే వీధులన్నీ బురదమయం

కాలువల్లో మురుగు.. రహదారులపై బురద

గ్రామ సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం..

ఇబ్బందుల్లో ప్రజలు!

2

మురుగు కూపంగా మేడిదపల్లి!

తిరుమలాయపాలెం, ప్రజా జ్యోతి నవంబర్ 5:



తిరుమలాయపాలెం మండలం మేడిదపల్లి గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. గ్రామంలోని పలు కాలనీల్లో మురుగు కాలువల్లో నీరు నిలిచిపోయి పచ్చగా మారుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లో నీరు సక్రమంగా ముందుకు వెళ్లకపోవడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. మరోవైపు వర్షం కురిసినప్పుడు గ్రామంలోని రహదారులపై నీరు నిలిచిపోయి బురదమయంగా మారుతున్నాయి. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే వీధులన్నీ బురదమయంగా మారుతుండటంతో స్థానికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు కాలువల్లో నిలిచిన మురుగు నీరు, మరోవైపు వర్షపు నీటితో బురదగా మారిన రహదారులు గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ తీరును ప్రశ్నిస్తున్నాయి. దోమలు పెరిగి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై అధికారులు దృష్టి సారించడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాలువలను శుభ్రం చేయడంతో పాటు వర్షపు నీరు రహదారులపై నిల్వ ఉండకుండా తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి ప్రజల ఇబ్బందులను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉద్రిక్తత్తం.....!
ఐదు గంటల తరువాత ప్రశాంతం...

అన్యాక్రాంతమైన స్థలం ను స్వాధీనం.
గ్రామ సమాఖ్య కు స్థలం కేటాయింపు.



నేలకొండపల్లి మండలం లోని ఆజయండా లో అన్యాక్రాంతమైన స్థలం విషయంలో వివాదం ఎట్టకేలకు సద్దుమణిగింది. ఐదు గంటల పాటు జరిగిన ఉత్కంఠత తరువాత స్థలం ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆజయ్ తండా పంచాయతీలో ప్రభుత్వం కు చెందిన స్థలం ను పక్కన ఉన్న వారు చర్చి నిర్వహాకులు ఆక్రమించారు. దీని పై పలుమార్లు పంచాయతీ అధికారులు చెప్పినా వినిపించుకోలేదు. కాగా ఆ స్థలం ను × గ్రామ సమాఖ్య భవనం కు కేటాయించటంతో నిర్వహాకులు అడ్డుకున్నారు. స్థలం తమదేనని... చర్చి నిర్వహాకులు అడ్డుకున్నారు. గురువారం తహశీల్దార్ పి.రాంప్రసాద్, ఎంపీడీఓ యం.యర్రయ్య.. మండల పంచాయతీ అధికారి యం.శ్రీనివాస రావు, ఎస్సై పి.శ్రీనివాసరెడ్డి లు ఘటనా స్థలం కు చేరుకున్నారు. స్థలం ప్రభుత్వం కు చెందినది..అందులో భవనం నిర్మించాలని చర్యలు చేపట్టటంతో.. స్థలం తమేదనని అధికారులతో వాగ్వివాదం కు దిగారు. దాదాపు ఐదు గంటల పాటు ఆరుపులు, కేకల మధ్య పంచాయతీ నడిచింది. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. నిర్వహాకులతో అధికారులు చర్చలు జరిపారు. ఎట్టకేలకు ఆ స్థలం గ్రామ సమాఖ్య భవనం కు కేటాయించినట్లు ఆ స్థలంలో హెచ్చరిక బోర్డు ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీయం సురేందర్, పీఆర్.ఏఈ.ప్రసాద్, సర్పంచ్ లు తేజావత్ శివాజీ, బోయిన వేణు, పంచాయతీ కార్యదర్శి బైరం దినేష్కుమార్, గ్రామ సమాఖ్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యాన్ని కాపాడాలి.. మహిళలపై దాడులు అమానుషం

ఇద్దరు క్రైస్తవ మహిళలపై దాడిని ఖండించిన పాస్టర్ చల్లగుండ్ల రమేష్ బాబు



ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి: ఏ మతానికి చెందిన వారిపైనైనా దాడులకు పాల్పడటం సరికాదని, మతసామరస్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని టిసిసి సినాడాఫ్ తెలంగాణ, ఖమ్మం జిల్లా క్రైస్తవ నాయకుడు, పాస్టర్ చల్లగుండ్ల రమేష్ బాబు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అల్మాస్గూడ ప్రాంతంలో ఇద్దరు క్రైస్తవ మహిళలపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా గురువారం ప్రకటనలో ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరమత సహనాన్ని పాటించకుండా, మహిళలనే గౌరవం కూడా లేకుండా వారిపై దాడులకు పాల్పడటం విచారకరమన్నారు. ఇటువంటి ఘటనలు మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. ఏ మతానికి చెందిన వారైనా ప్రశాంతంగా తమ విశ్వాసాలను ఆచరించే హక్కు ఉందన్నారు. దయచేసి ఇప్పటికైనా మతాలకతీతంగా మానవత్వానికి గౌరవం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించి, దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పాస్టర్ చల్లగుండ్ల రమేష్ బాబు కోరారు.

కారేపల్లి సంత వేలం 8.06లక్షలు.
రూ.1.43 లక్షలు పెరిగిన సంత వేలం ఆదాయం.



కారేపల్లి, నవంబర్ 5, ప్రజా జ్యోతి : సింగరేణి మండల కేంద్రం కారేపల్లిలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వర స్వామి సంతను రూ.8.06 లక్షలకు గుత్తేదారుడు దక్కించుకున్నాడు. వేలం పాటను దేవదాయశాఖ ఖమ్మం డివిజన్ పరిశీలకులు ఆర్.సమత సమక్షంలో గురువారం ఆలయ సంత్రంలో నిర్వహించారు. ఏడాది పాటు సంత నిర్వహణకు జరిగిన వేలం పాటలో 6గురు పాటదారులు రూ.50వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొన్నారు. గత ఏడాది రూ.6.63లక్షలకు గుత్తేదారు పాడుకోగా ఈ ఏడాది రూ.1.43లక్షలు పెరిగి రూ. 8.06 లక్షలకు నల్గొండ జిల్లా నార్కెట్ పల్లి కి చెందిన దూదిమెట్ల వెంకటేశ్వర్లు దక్కించుకున్నారు. పాటదారులు రూ. 6 లక్షల నుండి పాటను రూ.5వేలు చొప్పున పెంచారు. గతేడాది కంటే 21.60 శాతం పెరిగినట్లు పరిశీలకురాలు ఆర్.సమత తెలిపారు. ...

ఎస్సీ బాలికల హాస్టల్ ఆకస్మిక సందర్శన
సందర్శించిన బోనకల్ ఎంపీడీవో రూరావత్ రమాదేవి



బోనకల్, నవంబర్ 5 (ప్రజా జ్యోతి): మండల కేంద్రంలోని షెడ్యూల్ కులాల బాలికల వసతి గృహాన్ని గురువారం బోనకల్ ఎంపీడీవో రురావత్ రమాదేవి ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమాదేవి మాట్లాడుతూ... విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు అందించాలని అన్నారు. ప్రభుత్వం అందించే మౌలిక వసతులను విద్యార్థులకు మెనూ ప్రకారం అందించాలని అన్నారు. అనంతరం వర్షాకాలం సమయం ఉన్నందున హాస్టల్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అనంతరం హాస్టల్లో ఉన్న రికార్డులను పరిశీలించారు. ప్రతివారం హాస్టల్ ను సందర్శించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్.బి.ఐ.టి. విద్యార్థినికి రూ.9.6 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి తమ కళాశాలకు చెందిన ఈ.సి.ఈ. చివరి సంవత్సర విద్యార్థిని కేశమోని నందిని ప్రముఖ సి.ఏ.డీ, సి.ఏ.ఈ సంస్థ ఎల్లేషన్ నందు ఉద్యోగానికి ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సంస్థ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో తమ కళాశాల విద్యార్థిని కంప్యూటర్ ఎయిడెడ్ ఇంజినీర్ (సి. ఏ.ఈ) ప్రాజెక్ట్ ఇంజినీర్ గా ఉద్యోగానికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినిని కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్,అధ్యాపకులు మరియు ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ విభాగం అభినందించారు. విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ,కమ్యూనికేషన్ స్కిల్స్,సాంకేతిక పరిజ్ఞానం, ఉద్యోగావకాశాలపై ప్రత్యేక శిక్షణ అందించడం వల్లే ఇలాంటి విజయాలు సాధ్యమవుతున్నాయని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డా జి.ధాత్రి పేర్కొన్నారు. విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థల్లో ఉన్నత వేతనాలతో ఉద్యోగాలు సాధించేలా తాము నిరంతరం కృషి చేస్తామని కళాశాల వైస్ చైర్మన్ కె.శ్రీచైతన్య తెలిపారు.పూణే కేంద్రంగా నిర్వహించబడుతూ 2015 నుండి కంప్యూటర్ ఎయిడెడ్ ఇంజనీరింగ్ సి.ఏ.ఈ, కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్సి.ఏ.డి నందు సేవలను అందిస్తున్న ఎలేషన్ సంస్థలో తమ విద్యార్థిని ఎంపికవడం హర్షించదగ్గ విషయం అని కళాశాల ప్రిన్సిపాల్ డా జి.రాజా కుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థిని నందిని కు వార్షిక ఆదాయం గా 9.60 లక్షలు అందుకోనుందని తెలిపారు.శాశ్వత వర్క్ ఫ్రమ్ హోమ్ గా తను సంస్థకు సేవలు అందిస్తుందని తెలిపారు.ఎంపికైన



విద్యార్థిని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా ఎ.వి.వి. శివ ప్రసాద్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ దివాకర్‌కు, అధికార యంత్రాంగానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ప్రశంసలు

సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు వద్ద అధికార యంత్రాంగం ప్రదర్శించిన సమర్ధవంతమైన సమన్వయం ,అప్రమత్తత,విజయవంతమైన రక్షణ చర్యలను అభినందించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షు లు నూతి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ భారీ వర్షాలు ,వరదలతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న పరిస్థితులు నెలకొన్న వేళ ప్రాణాలకు తెగించి సహాయక చర్యల్లో పాల్గొన్న రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం సిబ్బంది సేవలు మరువలేనివని అన్నారు.బేతుపల్లి చెరువు ఉప్పొంగిన ప్రాంతంతో పాటు దమ్మపేట మండలంలో పలు గ్రామాలకు ముప్పు ఏర్పడిన సమయంలో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది తక్షణమే స్పందించి చేపట్టిన చర్యలను అభినందించారు. అదే విధంగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ప్రతి గురువారం ప్రజావాణి నిర్వహిస్తున్నామని ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని అదే విధంగా ఈరోజు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించామని అన్నారు.ఈనాటి ప్రజావాణిలో 38 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. ఈ దరఖాస్తులను జిల్లా మంత్రులు ,శాసనసభ సభ్యులు, అధికారులతో కలిసి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

చరిత్రలో నిలిచిపోయే విధంగా ఏఐకేఎస్ జాతీయ మహాసభలు

ఈనెల 15న లక్ష మందితో భారీ బహిరంగ సభ
పెట్టుబడిదారి విధానాలకు వ్యతిరేకంగా యువత పోరాటంలోకి..
సామినేని రామారావు హత్యలో "భట్టి" పాత్ర ప్రముఖం
ఖమ్మం జిల్లా నుంచి పదివేల మంది రైతులు హాజరు
రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతుకు భారీగా యువతను కదిలించాలి
సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు

బోనకల్ , నవంబర్ ఐదు (ప్రజా జ్యోతి): భారతదేశ చరిత్రలో నిలిచిపోయే విధంగా నల్లగొండ పట్టణంలో ఈనెల 15వ తేదీన ఏఐకేఎస్ జాతీయ మహాసభలను నిర్వహించనున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు తెలిపారు. స్థానిక వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో సిపిఎం మండల స్థాయి విస్తృత సమావేశం బంధం శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈనెల 15న లక్ష మందితో బహిరంగ సభ నిర్వహించినట్లు తెలిపారు. పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా యువత ప్రపంచవ్యాప్తంగా పోరాటంలోకి వస్తున్నారని తెలిపారు. ఏఐకేఎస్ జాతీయ మహాసభల విజయవంతం కోసం గ్రామ గ్రామాన విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని కోరారు. ఏఐకేఎస్ జాతీయ మహాసభలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కోరారు.సిపిఎం రాష్ట్ర నాయకులు అమరజీవి సామినేని రామారావు హత్యలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఆయన సతీమణి మల్లు నందిని పాత్ర నేరుగా ఉందని తెలిపారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ విలేకరుల సమావేశం కంటే ముందు సిపిఎం సామినేని రామారావు హత్య కేసులో నిందితులకు డిప్యూటీ సీఎం అండదండలు ఉన్నాయని



భావించామని, కానీ సిపి విలేకరుల సమావేశం అనంతరం ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం సామినేని రామారావు హత్యలో భట్టి విక్రమార్క పాత్ర నేరుగా ఉందని స్పష్టమైందన్నారు. సామినేని రామారావు కుమారుడు రౌండ్ టేబుల్ సమావేశంలో తమకు ఆస్తి, ఆర్థిక తగాదాలు ఎప్పుడు ఉన్నాయో, ఎక్కడున్నాయో చెబితే ఆ ఆస్తిని మొత్తం వాళ్లకే రాసిస్తామని స్పష్టం చేశారని తెలిపారు. త్వరలోనే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క క్యాంపు కార్యాలయం సిపి కార్యాలయం ముట్టడికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. హత్య చేయటమే కాక బాధితులు పైనే డిప్యూటీ సీఎం అక్రమ కేసులు బనాయించి సంతోషపడుతున్నాడని ఎద్దేవా చేశారు. ఏఐకేఎస్ జాతీయ మహాసభలకు బోనకల్ మండలం నుంచి మూడు వేల మంది రైతులు హాజరుకావాలని కోరారు. 1989లో 20వ ఏఐకేఎస్ మహాసభలో ఖమ్మంలో ఎంతో అట్టహాసంగా జరిగాయని తెలిపారు. ఏఐకేఎస్ జాతీయస్థాయిలో ప్రముఖ పాత్ర నిర్వహిస్తుందన్నారు. మహారాష్ట్రలో ఏఐకేఎస్ రైతుల రుణమాఫీ చేయాలని పెద్ద ఎత్తున పాదయాత్ర చేస్తుంటే ఆనాటి ముఖ్యమంత్రి స్వయంగా పాదయాత్ర వద్దకు వచ్చి 35వేల కోట్లు రుణమాఫీ చేస్తున్నట్టు ప్రకటించారన్నారు. రాజస్థాన్ రాష్ట్రంలో ఫాస్ట్ ట్రాక్ అనుమతి లేకుండా ట్రాక్టర్లు రోడ్డు మీద రావడానికి వీలులేదని ముఖ్యమంత్రి అడ్డంకులు సృష్టిస్తే ఏఐకేఎస్ ఆధ్వర్యంలో రైతులందరూ ట్రాక్టర్లతో రోడ్ల మీదకు వచ్చారని దీంతో ముఖ్యమంత్రి ఆ నిబంధనను ఎత్తివేసారని గుర్తు చేశారు. యువతను పార్టీలోకి పోరాటంలోకి తీసుకువచ్చే విధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కు మధ్యంతర ఎన్నికలలో అమెరికా ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. రిపబ్లికన్ పార్టీని గెలిపిస్తే తాను ఒక్కొక్క ఓటర్ కు ఐదువేల డాలర్లు బహుమతిగా ఇస్తానని డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన డోనాల్డ్ ట్రంప్ పార్టీని అమెరికా ప్రజలు ఘోరంగా ఓడించారన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇటలీ ప్రాన్స్ తదితర దేశాలలో యువత పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలలోకి వస్తున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల ఫలితంగా ఏఐకేఎస్ జాతీయ స్థాయిలో బలమైన పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కారల్ మార్క్స్ ఆనాడు చెప్పిన విధంగానే పెట్టుబడిదారీ వర్గం సమస్యలను పరిష్కరించదని నేడు రుజువైందని అందుకే యువత పెద్ద ఎత్తున ఆందోళనలోకి వస్తున్నారన్నారు. సిపిఎం మదిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు జిల్లా సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, చింతలచెరువు కోటేశ్వరరావు మండల కార్యదర్శి కిలారు సురేష్ మాట్లాడారు. ఈ సమావేశంలో జొన్నలగడ్డ సునీత, మంద కరుణ, బంధం వెంకటరాజ్యం, తెల్లాకుల శ్రీనివాసరావు, తుళ్లూరు రమేష్, గుగులోత్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పిఆర్సి పై కాలయాపన తగదు

టీ.ఎస్.యు.టీ. ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్

పాలేరు ఆర్.సీ నవంబర్05 ప్రజా జ్యోతి ప్రభుత్వం తెలంగాణ రెండవ పిఆర్సీ అమలుపై విపరీతమైన కాలయాపన చేస్తుందని, వెంటనే పిఆర్సి అమలు చేయాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో జరిగిన కూసుమంచి మండల 13వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పిఆర్సీ ఇవ్వకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉద్యోగ ,ఉపాధ్యాయ పెన్షనర్లు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, అసంతృప్తి తొలగాలంటే పిఆర్సీని వెంటనే ప్రకటించడం మినహా ప్రభుత్వము దగ్గర వేరే దారి లేదని తెలియజేశారు. 40 నెలల కాలంగా ఆలస్యమైన పిఆర్సీ గతంలో ఎప్పుడూ లేదని విమర్శించారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో మీనమేషాలు లెక్కిస్తుందని, ఉద్యోగులు సమాజంలో భాగం అని గ్రహించాలని హితవు పలికారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో ఇదే విధమైన కాలయాపన చేస్తే వచ్చే ఎన్నికల్లో ఇబ్బంది ఎదుర్కొంటుందని తెలియజేశారు. ప్రభుత్వం తక్షణమే పిఆర్సీని ప్రకటించడంతోపాటు, సిపిఎస్ రద్దు చేయడం, పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల, ఉపాధ్యాయుల, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి నిర్దిష్ట కాలపట్టిక రూపొందించాలని డిమాండ్ చేశారు. అలాగే టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మండవ.నర్సయ్య మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు పేరుతో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం సరికాదని హితవు పలికారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. యాప్ ల భారం తగ్గించి, ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయాలని



కోరారు. ఈ మహాసభలలో మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది.అధ్యక్షులుగా చిలకల. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా మండవ. నర్సయ్య , ఉపాధ్యక్షులుగా శ్రీనివాసరాజు నాగలక్ష్మి కోశాధికారిగా బాబురావు కార్యదర్శులుగా నరసింహారావు, ఉపేంద్ర వీరబాబు,జమీల్ పాషా,రాజకుమారి,కోటా చారి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలలో జిల్లా కార్యదర్శులు రాంబాబు,సురేష్ ప్రశాంతి ఇంకా ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధులు నడియాడిన ప్రాంతం ఎంత వరకు...?

భవిష్యత్ లో తవ్వకాలకు ప్రాంతాల గుర్తింపు.

నేడు నేలకొండపల్లి కి రానున్న పురావస్తు నిపుణులు షిండే.

రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ నాగరాజు.

నేలకొండపల్లి, నవంబర్ 5 ప్రజా జ్యోతి: దక్షిణ భారతదేశంలో కెల్లా అతి పెద్దదైన బౌద్ధక్షేత్రం పరిసరాలలో, బౌద్ధులు నడియాడిన నేల...నివాసం ఉన్న ప్రాంతాలను గుర్తించేందుకు పురావస్తు శాఖ డైరెక్టర్ డాక్టర్.పి.నాగరాజు ఆధ్వర్యంలో పరిశీలన జరిగింది. బౌద్ధక్షేత్రం అభివృద్ధిలో భాగంగా మాష్టర్ ప్లాన్ లో భాగంగా గురువారం డైరెక్టర్ నాగరాజు తో పాటు సాంకేతిక నిపుణుల బృందం పరిశీలించింది. తొలుత బౌద్ధక్షేత్రం తో పాటు పరిసర ప్రాంతాలు, భూములను పరిశీలించారు. అనంతరం బైరాగి గుట్ట ప్రాంతంలో ఉన్న పరిసర భూములను పరిశీలించారు. అక్కడ తవ్వకాలు చేపట్టారు. బౌద్ధులు నివసించిన ఆనవాళ్ల ను స్వాధీనం చేసుకున్నారు. బౌద్ధులు నడియాడిన ప్రాంతం ఎంత వరకు ఉందని...విషయం ను తెలుసుకునేందుకు భూములను గుర్తించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ నాగరాజు మాట్లాడారు...రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు పురావస్తు శాఖ. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. బౌద్ధుల నివాసం కు సంబంధించిన ఆనవాళ్లు ఉన్నందున్న భవిష్యత్తో తవ్వకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. బౌద్ధక్షేత్రం తో పాటు పరిసర ప్రాంతాలను పరిశీలించేందుకు



అర్కియాలజీ నిపుణులు షిండే శనివారం వస్తున్నట్లు తెలిపారు. బౌద్ధక్షేత్రం అభివృద్ధి మాష్టర్ ప్లాన్ పై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ గంగాదేవి, జిల్లా టూరిజం అధికారి సుమన్చక్రవర్తి, తహశీల్దార్ పి.రాంప్రసాద్, జీపీవో జానిమియా, తెలంగాణ యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది మరికంటి వెంకట్, సిద్ధార్థ యోగా విద్యాలయం వ్యవస్థాపకులు కె.వై.రామచందర్రావు, రాయగూడెం సర్పంచ్ బోయిన వేణు, ఎనిర్వాల్మెంట్ స్వచ్ఛంధ సంస్థ చైర్మన్ దుడ్డెల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా మండలి భవనాన్ని ఖాళీ చేయించాలి

నాలుగేళ్లుగా అద్దె చెల్లించిన రేషన్ దుకాణం



కల్లూరు, నవంబర్ 05 : ప్రజా జ్యోతి కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో ఉన్న మహిళా మండలికి చెందిన భవనంలో నిర్వహిస్తున్న రేషన్ దుకాణాన్ని వెంటనే కాళీ చేయించి, భవనాన్ని తిరిగి మహిళా మండల కి అప్పగించాలని కోరుతూ మహిళా మండలి ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం 13 వ వార్డులోని మహిళా మండలికి చెందిన భవనంలో రేషన్ దుకాణం నెంబర్ 2ను గత నాలుగేళ్లుగా నిర్వహిస్తున్నారు. అయితే భవనాన్ని వినియోగించుకున్నప్పటికీ సంబంధిత రేషన్ దుకాణం నిర్వాహకులు ఇప్పటివరకు అద్దె చెల్లించడం లేదని ప్రతినిధులు పేర్కొన్నారు. మహిళా మండలి కార్యకలాపాలకు అవసరమైన భవనాన్ని అద్దె చెల్లించకుండా వినియోగించుకోవడం వల్ల మండలికి ఆర్థిక నష్టం వాటిల్లుతోందని, ప్రస్తుతం నెలకు రూ.5 వేల చొప్పున నాలుగేళ్లకు సంబంధించిన అదెబ్బకాయలు మొత్తం సుమారు రూ.2,40,000 ఉన్నాయని వినతి పత్రంలో వివరించారు. ఈ మొత్తాన్ని సంబంధిత రేషన్ దుకాణం నిర్వాహకుల నుంచి వెంటనే వసూలు చేయాలని కోరారు. అదేవిధంగా భవనాన్ని ఖాళీ చేయించి మహిళా మండల కి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డి. లక్ష్మి, వార్డ్ కౌన్సిలర్లు ఎండి ఇస్మాయిల్, ఇంతియాజ్, దామాల దయాకర్ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ పంపిణీ

పాల్గొన్న గ్రామ సర్పంచ్ పలువురు గ్రామ పెద్దలు



చింతకాని నవంబర్ 05 ప్రజాజ్యోతి : మండలం ప్రొద్దుటూరు గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్న స్కూలు యూనిఫామ్ ను విద్యార్థులకు అందజేస్తున్న ప్రొద్దుటూరు గ్రామ సర్పంచ్ మొగిలి కృష్ణయ్య గ్రామ మాజీ సర్పంచ్ పెంట్యాల పుల్లయ్య ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ శ్రీనివాస్ గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీమతి రజియా గారు వార్డ్ మెంబర్ గొర్రె ముచ్చు జాను పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు

వరద విపత్తు పై అధికారుల చర్యలకు అభినందనలు





-మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట నియోజకవర్గం అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి మండలాలు, ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి నియోజకవర్గం సత్తుపల్లి హెడ్‌క్వార్టర్స్ పరిధిలో సంభవించిన వరదలు, వాటి నష్టాలపై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించామన్నారు. రాత్రి సమయంలో ముంపు ప్రాంతాల్లో చిక్కుకుపోయిన మత్స్యకారులను రక్షించడానికి వెళ్లిన ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రాణాలను పణంగా పెట్టి రక్షించారన్నారు. బోట్లు బోల్తా పడినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగినప్పటికీ, రాత్రి నుంచి ఉదయం వరకు అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఒక్క ప్రాణనష్టం కూడా జరగకుండా అందరినీ సురక్షితంగా కాపాడటం జరిగిందన్నారు.

ముఖ్యమంత్రి రాత్రి రెండు పర్యాయాలు ప్రత్యేకంగా మాట్లాడి, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై వెంటనే స్పందించాలని ఆదేశించారన్నారు. కలెక్టర్లు, అధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ పర్యవేక్షించడం వలన పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. 2023 డిసెంబర్‌లో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత, 2024 ఆగస్టు చివరిలో మున్నేరు వాగు ఊహించని రీతిలో సుమారు 76-77 అడుగుల ఎత్తుతో ప్రవహించినప్పుడు భారీ నష్టం వాటిల్లిందని, అప్పట్లో ఎస్డీఆర్ఎఫ్ దగ్గర తగిన పరికరాలు లేకపోవడాన్ని గమనించిన ముఖ్యమంత్రి, మంత్రులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ విపత్తు సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.

పోలీసు శాఖ నుంచి 1200 మందిని, ఫైర్ డిపార్ట్‌మెంట్ నుంచి 700 మందిని ఎంపిక చేసి ఎస్డీఆర్ఎఫ్‌ను పటిష్టం చేయడంతో పాటు, మొత్తం 1,900 మంది సిబ్బందికి పూర్తి స్థాయి శిక్షణ ఇచ్చామన్నారు. సుమారు రూ. 260-270 కోట్ల వ్యయంతో అత్యుత్తమ అత్యాధునిక పరికరాలను ఎస్డీఆర్ఎఫ్ కు ప్రభుత్వం సమకూర్చిందన్నారు. ఫలితంగా రాష్ట్రంలో ఏ మూలన విపత్తు వచ్చినా 45 నుండి 50 నిమిషాల లోపు సహాయక చర్యలు అందించేలా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని, ప్రాణనష్టం జరగకుండా అహర్నిశలు శ్రమించిన అధికారులు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు,ప్రజాప్రతినిధులందరికీ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేక అభినందనలు తెలిపారు.రాష్ట్రంలో సంభవించిన భారీ వర్షాలు, విపత్తు పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం అత్యంత వేగంగా స్పందించిందని, ఎక్కడా ఎటువంటి ప్రాణహాని జరగకుండా పూర్తి స్థాయిలో ప్రాణాలను, ఆస్తులను కాపాడగలిగామని మంత్రి అన్నారు. విపత్తు సంభవించిన వెంటనే కేవలం 30 నుంచి 35 నిమిషాల వ్యవధిలోనే రెస్క్యూ టీమ్‌లు రంగంలోకి దిగాయని తెలిపారు.నీళ్లలో ఇరుక్కుపోయిన వారిని సెల్‌లైట్ల ఆధారంగా గుర్తించి, టెక్నాలజీని, మ్యాన్‌పవర్‌ను సద్వినియోగం చేస్తూ సింగిల్ ప్రాణహాని కూడా జరగకుండా రక్షించడం జరిగిందన్నారు. రాత్రింబవళ్ళు నిద్రలేకుండా కష్టపడి పనిచేసిన ప్రతి అధికారిని, సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సంబంధిత శాఖా మంత్రిగా అభినందించారు. అశ్వారావుపేట నియోజకవర్గం, సత్తుపల్లి తదితర ప్రాంతాలలో విద్యుత్ శాఖ, నీటిపారుదల శాఖ, ఆర్‌అండ్‌బి, పంచాయతీ రాజ్, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో జరిగిన నష్టాన్ని అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించాలన్నారు. కొన్ని ప్రాంతాలలో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు తెగడం, చెరువులు పొంగిపొర్లడం వల్ల కింద ఉన్న వరి ఇతర పంటలు దెబ్బతిన్నాయనారు. మల్లెపూవు వాగు ప్రవహించడం వల్ల డౌన్‌స్ట్రీమ్‌లో ఉన్న పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. రోడ్లపైకి చెత్తాచెదారం, వరద నీరు చేరడం వల్ల కొన్ని చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. ఇరిగేషన్, ఆర్‌అండ్‌బి, పంచాయతీ రాజ్ రోడ్లకు వాటిల్లిన నష్టాన్ని అంచనా వేయాలన్నారు. విపత్తు ప్రాతిపదికన రానున్న 2-3 రోజుల్లోగా నష్టానికి సంబంధించిన పూర్తి స్థాయి డీటెయిల్డ్ ఎస్టిమేట్స్‌ను ప్రభుత్వానికి సమర్పించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించడం జరిగిందన్నారు.

కేవలం అధికారుల అంచనాలే కాకుండా, కలెక్టర్లు, వ్యవసాయ శాఖాధికారులు స్వయంగా ఫీల్డ్ విజిట్లు నిర్వహించి, నిజంగా నష్టపోయిన రైతులను గుర్తించి ఆ వివరాలు పంపాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. .

గత 36 గంటలుగా నిరంతరం శ్రమించి, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విపత్తు నిర్వహణలో కష్టపడిన ఎస్డీఆర్ఎఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ సిబ్బందిని మంత్రి ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ సిబ్బందిలో ఎవరికైనా ఇళ్లు లేని పక్షంలో, వారికి ప్రభుత్వం తరఫున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడతామని, అర్హులైన వారి జాబితాను పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇరిగేషన్, ఆర్‌అండ్‌బి, పంచాయతీ రాజ్, వ్యవసాయ, విద్యుత్, తాగునీరు శాఖలకు చెందిన అధికారులు తమ శాఖల వారీగా జరిగిన వాస్తవ నష్టాలపై తక్షణ నివేదికను రానున్న 2-3 రోజుల్లో అందజేయాలని మంత్రి ఆదేశించారు.సమీక్షలో పాల్గొన్న ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో సంభవించిన ఆకస్మిక వరద పరిస్థితులలో సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు వద్ద చిక్కుకున్న మత్స్యకారులను జిల్లా యంత్రాంగం, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాల అప్రమత్తతతో పూర్తిగా రక్షించడం జరిగిందన్నారు. చెరువు నీటి మట్టం, ప్రవాహ ఉధృతీ సమయంలో సాయంత్రం సుమారు 5:00 గంటల సమయంలో 8 మంది మత్స్యకారులు తెప్ప బోటును వేసుకుని చెరువులోకి వెళ్లడం జరిగిందని, వరద ఉధృతి పెరగడంతో వారు అక్కడే ఇరుక్కుపోవడం జరిగిందని తెలిపారు. అధికారులు స్పందించి, తక్షణ సహాయక చర్యల కోసం అందరినీ సమాయత్తం చేశామన్నారు. అప్పటికే భద్రాచలంలో విధులు నిర్వహిస్తున్న ఎస్డీఆర్ఎఫ్ బృందాన్ని ఇక్కడికి తక్షణమే రప్పించగా, వారు కేవలం 25 నిమిషాల్లోనే సంఘటన స్థలానికి చేరుకున్నారన్నారు. మొదటి బోటు ద్వారా వెళ్లి, ఈత రాని ముగ్గురు మత్స్యకారులను సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చారున్నారు.

ఆ తర్వాత రెండవ బోటు సహాయంతో మిగతా వారిని రక్షించడానికి వెళ్లిన సమయంలో, వరద ప్రవాహం మరింత పెరగడంతో రెండు బోట్లు బ్యాలెన్స్ కోల్పోయి ఎస్డీఆర్ఎఫ్ బృందం కూడా నీటిలో పడిపోవడం జరిగిందని తెలిపారు. తక్షణమే అప్రమత్తమైన యంత్రాంగం విజయవాడ నుండి కెప్టెన్ కిరణ్, నీరజ్ ల నేతృత్వంలోని ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రప్పించామని తెలిపారు. పోలీసు శాఖ, ఇతర యంత్రాంగం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మొబైల్ లొకేషన్ ట్రేసింగ్ ఉపయోగించి రాత్రి సమయంలో కూడా గాలింపు చర్యలు ముమ్మరం చేశారన్నారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సాహసోపేతంగా వ్యవహరించిన ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, పోలీసు యంత్రాంగం చొరవతో మొత్తం 8 మంది మత్స్యకారులను, రెస్క్యూ సిబ్బందిని ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా పూర్తిగా రక్షించగలిగామన్నారు. ప్రాణాలకు తెగించి సహాయక చర్యల్లో పాల్గొన్న విపత్తు యంత్రాంగానికి కలెక్టర్ అభినందనలు తెలిపారు.

సమీక్షలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జిల్లాకు రెడ్ అలర్ట్ నేపథ్యంలో నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తూ , అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధమై, సహాయక చర్యలను వేగవంతం చేసిందని తెలిపారు. గతంలో భద్రాచలం డివిజన్ చెర్ల, దుమ్ముగూడెం, గోదావరి పరివాహక ప్రాంతాల పరిధిలో వరద ముప్పు ఎక్కువగా ఉండేదని, అయితే ఈసారి కొత్తగూడెం డివిజన్‌లో ముందెన్నడూ లేని విధంగా అత్యంత భారీ వర్షపాతం నమోదైందని అన్నారు.



ఘనంగా నిశ్చితార్థ వేడుక.. వధూవరులను ఆశీర్వదించిన

సర్పంచ్ వీరబాబు, బీఆర్ఎస్ నాయకులు

చింతకాని నవంబర్ 5: (ప్రజాజ్యోతి): మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామానికి చెందిన మడిపల్లి నాగయ్య -- తులిసమ్మ దంపతుల కుమార్తె కోటేశ్వరి, అలాగే చీమలదారి వెంకటనారాయణ దంపతుల కుమార్తె నికిత--వినీత్ గౌడ్‌ల వివాహ నిశ్చితార్థ మహోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. ఖమ్మం పట్టణంలోని మారెమ్మ గుడి సమీపంలో గల 'అమ్మ ఫంక్షన్ హాల్'లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఈ వేడుకను వైభవంగా నిర్వహించారు. ఈ శుభకార్యానికి తిరుమలాపురం గ్రామ బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ చాపలమడుగు వీరబాబుతో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన జంటను అక్షతలు వేసి దీవించి, ఆశీర్వచనాలు అందజేశారు. వారి భావి జీవితం నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉద్యమకారుడు గోదా రవీందర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు బండి రామారావు, గోగుల నరసింహారావు, బండి సైదులు, సువర్ణ, కంటి నాగేశ్వరరావు, బండి



యాకోబు, బండి గోపీనాథ్, మరీదు రాము, మడిపల్లి రామకృష్ణ, మడిపల్లి పెంటయ్య, చాపలమడుగు సైదులు, మడిపల్లి శీను తదితరులు పాల్గొని వధూవరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు.

మిట్టపల్లి రాజేంద్ర ప్రసాద్‌కు ఘన నివాళి

నివాళులర్పించిన మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు



బోనకల్, నవంబర్5 (ప్రజా జ్యోతి): మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు మిట్టపల్లి రాజేంద్రప్రసాద్ ఇటీవల మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఆయన మృతి పట్ల బోనకల్ మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన దశదినకర్మకు హాజరై రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. రాజేంద్ర ప్రసాద్ మృతి తమను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. ఆయన మరణం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి ఈ కష్ట సమయంలో అండగా ఉంటామని తెలిపారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. నివాళులర్పించిన వారిలో బోనకల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చెడే వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కటకం శ్రీనివాసరావు, కటకం కార్తీక్, గుర్రం పూర్ణచంద్ర రావు, రంగా జనార్దన్, రంగా నాగేశ్వరరావు, చెన్నా సుధీర్, చెన్నా భాను, పల్లబోతుల గోపి, తెల్లాకుల శ్రీనివాసరావు, మిరియాల రవికిరణ్, వెచ్చా సీతారాములు, వెచ్చా నాగేశ్వరరావు, వెచ్చా శ్రీనివాసరావు, మోదుగుపల్లి వెంకన్న, చింటూ, గుర్రం వెంకటేశ్వరరావు, చెడే సైదారావు, రంగా హనుమంతరావు,చవట హరి, చెడే సాయిబాబు,గుర్రం మణికంఠ, గుర్రం శ్రీనివాసరావు, పులకండం శ్రీనివాసరావు,కలవల సుబ్బారావు, సుగ్గల బ్రహ్మాంజనేయులు, కోణతాలపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో 'శరత్ ఆర్తో అండ్ స్పైన్ సెంటర్' ప్రారంభం

ప్రారంభోత్సవానికి హాజరైన మున్సిపల్ చైర్మన్ సామినేని సుజాత రామనాథం

పేద,మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో వైద్యం అందించాలని డాక్టర్లకు చైర్పర్సన్ విజ్ఞప్తి

మధిర/ఖమ్మం ప్రజా జ్యోతి ఖమ్మం నగరంలో 'శరత్ ఆర్తో అండ్ స్పైన్ సెంటర్' గురువారం ఘనంగా ప్రారంభమైంది.డాక్టర్ శరత్ చంద్ర ప్రారంభించిన ఈ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,రోడ్డు ప్రమాద బాధితులకు స్థానికంగా మెరుగైన వైద్యం అందించడంలో ఈ ఆసుపత్రి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరలతో వైద్యం అందించాలని డాక్టర్లను ఆమె కోరారు.అనంతరం డాక్టర్ శరత్ చంద్ర,శైలజ



దంపతులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, సూర్యదేవర కోటేశ్వరావు పాల్గొన్నారు.

వర్షాలకు నేలకొరిగిన మిరప తోటల పరిశీలన రైతులకు పలు సూచనలు

ఖమ్మం ప్రతినిధి: (ప్రజా జ్యోతి) నవంబర్: 5 వేంసూరు మండలం కల్లూరుగూడెం గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు నేలకొరిగిన మిరప, వైరా మండలం ఖానాపురం గ్రామంలోని అవకాడో తోటలను జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎం.వి. మధుసూదన్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట పరిస్థితిని, నష్టం వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా మురుగు కాలువల ద్వారా బయటకు పంపించాలని, మొక్కల మొదళ్ల వద్ద మట్టిని ఎగదోసి తిరిగి నిలదొక్కుకునేలా చేయాలని సూచించారు. పొలంలో తేమ అధికంగా ఉన్నప్పుడు నీటి తడులు, ఎరువుల వాడకం నిలిపివేయాలన్నారు. అధిక తేమ కారణంగా వేరుకుళ్లు,





కొమ్మకుళ్లు, ఆకుమచ్చ తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉన్నందున తోటలను నిత్యం పరిశీలించాలని సూచించారు. తెగుళ్ల లక్షణాలు కనిపిస్తే ఉద్యాన శాఖ అధికారుల సలహా మేరకు తగిన నివారణ చర్యలు చేపట్టాలని, శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఖానాపురం గ్రామంలో వైరా ఉద్యాన అధికారి ఆకుల వేణు, కల్లూరుగూడెం గ్రామంలో సత్తుపల్లి ఉద్యాన అధికారి శ్రావణితో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఘనంగా బిఆర్ఎస్ నాయకులు బొగ్గుల భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు



మధిర ప్రజా జ్యోతి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మధిర మండల బి ఆర్ఎస్ పార్టీ కార్యదర్శి బొగ్గుల భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో గురువారం మధిర బి ఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి భాస్కర్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ అభివృద్ధికి, ప్రజాసేవకు ఆయన మరింత ఉత్సాహంతో ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

ఖమ్మం జిల్లాలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు 2026 విజయవంతం







ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి ఖమ్మం జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు 2026 కార్యక్రమం గురువారం ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి సుమారు 650 మంది యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి తుంబూరు సునీల్ రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి శ్రీమతి మాధవి,ఎస్.ఆర్.బి.జి.ఎన్.ఆర్కళాశాల ప్రిన్సిపాల్ ఎం.డి.జాకీరుల్లా, ఎం. వెంకట రాంబాబు మేరా యువ భారత్ కోఆర్డినేటర్ ,యువజన సర్వీసుల శాఖ నుండి మేనేజర్ శ్రీ ఆర్. ఉదయ్ కుమార్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ యువజన ఉత్సవాల్లో యువతలోని సృజనాత్మకత, కళాత్మక ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో వివిధ పోటీలు నిర్వహించారు. ముఖ్యంగా జానపద నృత్యాలు, జానపద గేయాలు, వీధి నాటకం, పోస్టర్ తయారీ (చిత్రలేఖనం), కవిత్వ రచన తదితర విభాగాల్లో యువత తమ ప్రతిభను ప్రదర్శించారు.పోటీల నిర్వహణలో వ్యాఖ్యాతగా సుధీర్,యువజన సంఘాల ప్రెసిడెంట్ వ్యవహరించగా, జిల్లా యువజన సంఘాల సభ్యులు కార్యక్రమ నిర్వహణలో చురుకుగా పాల్గొని సహకరించారు.వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు,ప్రశంసాపత్రాలు అందజేశారు.యువతలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారిలో నాయకత్వ లక్షణాలు, సాంస్కృతిక విలువలు, సృజనాత్మకతను పెంపొందించేందుకు ఇటువంటి యువజన ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయని అతిథులు పేర్కొన్నారు.చివరగా,యువతీ యువకుల విశేష భాగస్వామ్యం,న్యాయనిర్ణేతలుజిల్లా యువజన సంఘాల సభ్యుల సహకారంతో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు 2026 కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

అభివృద్ధికి నిధులున్నా.. అంబేద్కర్ నగర్‌కు దక్కని మోక్షం

17వ వార్డులో ఏళ్ల తరబడి తీరని మురుగునీటి సమస్య

నిధులు కేటాయించిన డ్రైనేజీ నిర్మాణం ఏది? డెంగ్యూ?, విష జ్వరాల భయంతో బిక్కుబిక్కుమంటున్న నగరవాసులు

కల్లూరు, నవంబర్ 05 : ప్రజా జ్యోతి కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల అభివృద్ధి కోసం ప్రతి వార్డులో సీ సీ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణానికి సుమారు 40 లక్షల చొప్పున నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నప్పటికీ, 17వ వార్డు అంబేద్కర్ నగర్ ప్రజలకు మాత్రం మురుగునీటి సమస్య శాపంగా మారింది. ఏళ్లు గడుస్తున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో అభివృద్ధి పనులు జరుగుతున్న తమ వార్డులో మాత్రం కనీస సౌకర్యాలు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 35 ఏళ్ల క్రితం ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన ఈ కాలనీలో గుంట స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు జరగడంతో అప్పటినుంచి సరైన సైడ్ డ్రైనేజీ వ్యవస్థ లేకుండా పోయింది. ఫలితంగా ఇళ్ల నుంచి వెలువడే మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. చిన్నపాటి వర్షం కురిసిన వర్షపు నీటితో పాటు మురుగునీరు ఇళ్లలోనికి చేరుతుండడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం రహదారులు బురదమయంగా మారి రోడ్లపై మురుగునీరు నిల్వ ఉండడంతో రాకపోకలకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు.

వ్యాధులు ముప్పు పొంచి ఉన్న పట్టించుకునేవారేరీ?

గతంలో జిల్లాలోనే అత్యధిక డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతంలో అంబేద్కర్ నగర్ కూడా ఒకటిగా గుర్తింపు పొందిందని స్థానికులు పేర్కొంటున్నారు. అయినప్పటికీ మురుగునీటి సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపట్టకపోవడంపై అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిల్వ ఉన్న మురుగునీటి కారణంగా దోమలు విపరీతంగా పెరిగి డెంగ్యూ టైఫాయిడ్ ఇతర విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. మురుగునీటి ప్రవాహానికి సరైన మార్గం లేకపోవడంతో ఇరుగుపొరుగు కుటుంబాల మధ్య నిత్య వివాదాలు చోటు చోటు చేసుకుంటున్నాయని వాపోతున్నారు.

వినతులు ఎన్నో స్పందన మాత్రం శూన్యం!

ఈ సమస్య పరిష్కారం కోసం పలుమార్లు ప్రజాప్రతినిధులకు మున్సిపల్ అధికారులకు మొరపెట్టిన ఫలితం లేకుండా పోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు మున్సిపాలిటీలో ఇతర వార్డులకు అభివృద్ధి పనులు చేపడుతున్నప్పుడు అంబేద్కర్ నగర్ సమస్యను ఎందుకు విస్మరిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పట్టణ అభివృద్ధి ప్రణాళికలో





కేటాయించడం నిధులతో పెండింగ్లో ఉన్న సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులను తక్షణమే చేపట్టి మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ఎప్పటికైనా ప్రజాప్రతినిధులు మున్సిపల్ అధికారులు స్పందించి అంబేద్కర్ నగర్ ప్రజలకు డెంగ్యూ టైఫాయిడ్ వంటి వ్యాధుల ముప్పు నుంచి రక్షణ కల్పించాలని, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ప్రధాన లక్ష్యం

ఖమ్మం కార్పొరేషన్ లో పాత్తు కుదిరితే కాంగ్రెస్తో ఉంటాం లేకపోతే సొంతంగా నిలబడతాం

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం తప్పదు

ఐ యు ఎం ఎల్ బలమైన శక్తిగా తెలంగాణలో తయారు చేస్తాం.

ఖమ్మంలో ఐ యూ ఎం ఎల్ మీడియా సమావేశం.. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు అడ్వకేట్ మహమ్మద్ షకీల్





ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని రెస్టిన్ హోటల్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఎస్.కె.బాజీబాబా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అడ్వకేట్ మహమ్మద్ షకీల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ షకీల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, సామాజిక న్యాయం, మతసామరస్యం, ప్రజల హక్కుల సాధనకు ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పించడంతో పాటు వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి పార్టీ కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు.ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేయడం,విద్యా, వైద్య రంగాల్లో పేదలకు న్యాయం జరిగేలా పోరాటం చేయడం తమ పార్టీ ప్రధాన లక్ష్యాలని వివరించారు. ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం, పరస్పర గౌరవం పెంపొందించడంలో రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎస్.కె. బాజీబాబా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పార్టీ విస్తరణకు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతామని తెలిపారు.ఈ మీడియా సమావేశం ద్వారా పార్టీ భవిష్యత్ కార్యాచరణ,ప్రజా సమస్యలపై తమ వైఖరిని ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేశారు. ప్రజాసేవ, సామాజిక సమానత్వం, సోదరభావమే లక్ష్యంగా ఐ యూ ఏం ఎల్ ముందుకు సాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ జిల్లా కార్యదర్శి చీమకుర్తి బ్రహ్మచారి ఆటో యూనియన్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ హనీఫ్. జిల్లా కోశాధికారి సర్వర్ పాషా , ముస్లిం స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షురాలు ఫర్హీన సుల్తానా హరి బహదూర్ బి,రాజు,మహిళా అధ్యక్షురాలు షేక్ జరీనా అదేవిధంగా రాష్ట్ర నాయకత్వం తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో బియ్యం దుకాణాలపై సంయుక్త తనిఖీలు

53 బియ్యం బస్తాలు సీజ్, వ్యాపారులకు జరిమానా జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా పౌర సరఫరాల అధికారి, లీగల్ మెట్రాలజీ అధికారి సంయుక్తంగా ఖమ్మం పట్టణంలోని పలు కిరాణా, రైస్ స్టోర్లలో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్ అన్నారు. ఈ తనిఖీల సమయంలో బియ్యం బస్తాలపై ముద్రించిన బరువు కంటే తక్కువ బరువు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు,నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను అమలులో ఉన్న లీగల్ మెట్రాలజీ చట్టం ప్రకారం సంబంధిత వ్యాపారులపై జరిమానా విధించడమే కాకుండా, తక్కువ బరువు ఉన్న బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.ఈ తనిఖీల్లో భాగంగా మామిళ్లగూడెంలోని లక్ష్మీ వేంకటేశ్వర కిరాణా ఁ జనరల్ మర్చంట్ లో రూ. 18 వేల విలువుగల 12 బస్తాలు, శ్రీ లక్ష్మీ బాలాజీ కిరాణా ఁ జనరల్ స్టోర్ లో రూ. 28,500 విలువుగల 15 బస్తాలు సీజ్ చేశారన్నారు.అలాగే కస్బా బజార్లోని షేక్ జానీమియా రైస్ స్టోర్స్ లో రూ.7,500 విలువుగల 5 బస్తాలు, సుపీరియర్ ఎంటర్ ప్రైజెస్ లో రూ. 42 వేల విలువుగల 21 బియ్యం బస్తాలను అధికారులు సీజ్ చేశారన్నారు. మొత్తంగా నాలుగు దుకాణాల్లో కలిపి రూ.96 వేల విలువైన 53 బియ్యం బస్తాలను సీజ్ చేసినట్లు పౌర సరఫరాల అధికారి తెలిపారు.ఈ సందర్భంగా పౌరసరఫరాల అధికారి మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. బియ్యం బస్తాలపై ముద్రించిన తూకం ప్రకారమే విక్రయాలు జరపాలని,తూకంలో తేడాలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులను హెచ్చరించారు.వినియోగదారులకు సరైన పరిమాణంలో సరుకులు అందేలా చూడటానికి జిల్లాలోని వ్యాపారులందరూ అధికారుల తనిఖీలకు సహకరించాలని కోరారు.

వర్షాలకు నేలకొరిగిన మిరప తోటల పరిశీలన





ఖమ్మం ప్రతినిధి: (ప్రజా జ్యోతి) నవంబర్: 5 ముదిగొండ మండలం వనం వారి కృష్ణాపురం, చింతకాని మండలం నేరడ గ్రామాల్లో వర్షాలకు నేలకొరిగిన మిరప తోటలను ముదిగొండ వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, మధిర ఉద్యాన అధికారి విష్ణు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట పరిస్థితిని తెలుసుకున్నారు. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, నేలకొరిగిన మొక్కలను తిరిగి నిలబెట్టాలని, తెగుళ్ల నివారణకు అధికారుల సూచనలు పాటించాలని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో రైతు ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

కల్లూరు, నవంబర్ 05 : ప్రజా జ్యోతి భార్య భర్తల మధ్య జరిగిన గొడవతో మనస్థాపానికి గురైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన చంద్రుపట్ల గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే చంద్రుపట్ల గ్రామానికి చెందిన మర్సకట్ల శేఖర్ (51) దురలవాట్లకు బానిసై ఇంట్లోనే డబ్బులను దుబారా ఖర్చు చేస్తున్నాడనే విషయమై ఈనెల 23న భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో తీవ్ర ఆవేశానికి గురైన శేఖర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ నవంబర్ 5వ తేదీ రాత్రి 12.30 గంటలకు మృతి చెందాడు. మృతుడు భార్య మర్సకట్ల రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మై భారత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన వికసిత్ భారత్ యువ సంవాద్.





ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి భారత ప్రభుత్వ యువజన సర్వీసులు క్రీడా మంత్రిత్వ శాఖ, మై భారత్ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో ఘనంగా వికసిత్ భారత్ – యువ సంవాద్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. యువ సంవాద్ అనేది భారతదేశంలో యువతను దేశాభివృద్ధి మరియు విధాన రూపకల్పనలో భాగస్వాములను చేయడానికి ఉద్దేశించిన ఒక ముఖ్యమైన వేదిక ఈ కార్యక్రమం మహిళ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కనౌ యువర్ ఓటు అంశం పైన యూత్ ఐకాన్ అయినటువంటి తేజావత్ సాయి కృష్ణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా యువతకు వివరించడం జరిగింది. అందులో భాగంగా ఎస్.ఐ.ఆర్,డెమోక్రసీ,మొబోక్రసీ మరియు ఓటు హక్కులు ఎలా వినియోగించుకోవాలి అనేది వివరిం చడం జరిగింది. ఈ కార్యక్రమంలో మీరాయోభారత్ చేపడుతున్న కార్యక్రమాల గురించి మరియు మైభారత్ పోర్టల్లో యువత ఎలా నమోదు చేసుకోవాలో జిల్లా యువ అధికారి అయినటువంటి వెంకట రాంబాబు వివరించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బానోత్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎ.జే.రామారావు, మేరా యువ భారత్ డిస్టిక్ యూత్ ఆఫీసర్ ఎం. రాంబాబు, అకౌంట్స్ ఆఫీసర్ కే.భానుచందర్,పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన దీపావళి టపాసులపై టాస్క్‌ఫోర్స్ దాడులు..

రూ.లక్ష విలువైన టపాసులు స్వాధీనం

ఖమ్మం ప్రతినిధి: (ప్రజా జ్యోతి) నవంబర్: 5 దీపావళి పండుగ నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా టపాసులు నిల్వ ఉంచి విక్రయించే వారిపై ఖమ్మం పోలీస్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు కొరడా ఝళిపించారు. ఖమ్మం నగరంలోని చర్చికాంపౌండ్ రోడ్డులో రంగచారి హాస్పిటల్ ఎదురుగా వున్నా నల్లా బాలకృష్ణ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులపై టాస్క్‌ఫోర్స్ సిఐ ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి సుమారు రూ.లక్ష విలువైన టపాసులను స్వాధీనం చేసుకొని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు అప్పగించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా టపాసులను నిల్వ ఉంచడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు ప్రమాదం కలిగించే విధంగా నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



దీపావళి పండుగను ప్రజలందరూ సురక్షితంగా జరుపుకోవాలని, అనుమతులు కలిగిన విక్రయ కేంద్రాల నుంచే టపాసులు కొనుగోలు చేయాలని సూచించారు. అక్రమ టపాసుల నిల్వలు, విక్రయాలపై సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

పీఎం శ్రీ కార్యక్రమంలో భాగంగా వరంగల్‌లో విద్యార్థినులకు పారిశ్రామిక విజ్ఞాన యాత్ర



ఎర్రుపాలెం, ప్రజా జ్యోతి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాల (బాలికలు), ఎర్రుపాలెం విద్యార్థినులు పీఎం శ్రీ కార్యక్రమంలో భాగంగా గురువారం వరంగల్‌లో పారిశ్రామిక విజ్ఞాన యాత్ర (ఇండస్ట్రియల్ టూర్) నిర్వహించారు. ఈ యాత్రలో భాగంగా విద్యార్థినులు కాకతీయ టెక్స్టైల్స్ మరియు ఏ బి సి బ్యూటీ పార్లర్ ను సందర్శించారు. ఈ సందర్భంగా వస్త్ర పరిశ్రమలో ఉత్పత్తి ప్రక్రియలు, పనితీరు, నైపుణ్యాలు, అలాగే బ్యూటీ అండ్ వెల్‌నెస్ రంగంలో అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలు, వృత్తి నైపుణ్యాల గురించి ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విద్యార్థినులకు క్షేత్రస్థాయి అనుభవం కల్పించడం, వారిలో సృజనాత్మకత, పరిశీలనా శక్తి, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధిపై అవగాహన పెంపొందించడం ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఇలాంటి పారిశ్రామిక పర్యటనల ద్వారా విద్యార్థినులు వివిధ రంగాల్లోని పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించి, నూతన విషయాలను నేర్చుకోవడంతో పాటు భవిష్యత్తులో తమ ఆసక్తి, అభిరుచులకు అనుగుణంగా కెరీర్‌ను ఎంచుకోవడానికి అవసరమైన అవగాహన పొందుతారని తెలిపారు. విద్యార్థినుల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా పీఎం శ్రీ కార్యక్రమం ద్వారా ఇటువంటి వినూత్న విద్యా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పాఠశాల ప్రిన్సిపాల్ చావా. జ్యోతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని లు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

నూతన వధూవరులను ఆశీర్వదించిన గురుసేవ ఫౌండర్ కొత్తపల్లి గురుప్రసాద్



మధిర ప్రజా జ్యోతి స్థానిక యస్ఆర్ ఫంక్షన్ హాల్ లో గురువారం జరిగిన డివిజనల్ ఇంజనీర్ వెల్లంకి బాబు రావు కుమార్తె వివాహానికి హాజరైన ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు గురుఫౌండేషన్ చైర్మన్ కొత్తపల్లి గురుప్రసాద్, హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు ఈ సందర్భంగా గురు ప్రసాద్ నూతన వధూవరులను నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో పిల్లాపాపలతో సంతోషంగా జీవించాలని నూతన వధూవరులను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో రిటైర్ ఏఎస్ఐ మడుపల్లి బాబు, రిటైర్ హెడ్మాస్టర్ ఇనపనూరి ప్రదీప్ కుమార్, మోదుగు మోహన్ రావు, కోట ఆదినారాయణ, కారుమంచి దయాకర్,వెల్లంకి జైపాల్, డాక్టర్ భాస్కర్ రావు, బొబ్బిళ్ళ పాటి క్రిస్టోఫర్,, జయప్రకాష్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం ట్రాఫిక్ పోలీసుల నిజాయితీ పోయిన పర్సు, రూ. 9,000 నగదు బాధితుడికి అందజేత



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి స్థానిక జడ్పీ సెంటర్ నందు ప్రయాణిస్తున్న ఒక ఆటోలో నుంచి ప్రమాదవశాత్తు పడిపోయిన పర్సును ఖమ్మం ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకుని, దాని యజమానికి సురక్షితంగా అందజేసి తమ నిజాయితీని చాటుకున్నారు.సమాచారం ప్రకారం, జడ్పీ సర్కిల్ వద్ద విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు రోడ్డుపై పడి ఉన్న పర్సు కనిపించింది. వెంటనే ఆయన దానిని తీసి పరిశీలించగా,అందులో రూ. 9,000 నగదుతో పాటు ఒక పేటీఎం కార్డ్ ఉంది. అయితే యజమానికి సంబంధించిన ఇతర ఆధారాలేవీ అందులో లభించలేదు.?దీంతో అప్రమత్తమైన ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్,పర్సులో ఉన్న పేటీఎం కార్డ్ వివరాల ఆధారంగా చాకచక్యంగా వ్యవహరించి సదరు పర్సు యజమాని అడ్రస్‌ను ట్రేస్ చేశారు.అనంతరం బాధితుడికి సమాచారం అందించి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. గురువారం ట్రాఫిక్ సీఐ శివప్రసాద్ పోలీస్ స్టేషన్‌లో బాధితుడికి నగదుతో కూడిన పర్సును స్వయంగా అందజేశారు. పోయిన తమ సొత్తును సురక్షితంగా అప్పగించినందుకు బాధితుడు ట్రాఫిక్ సీఐ కి, హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్‌కు మరియు డ్యూటీ కానిస్టేబుల్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.సిబ్బంది ప్రదర్శించిన సమయస్ఫూర్తిని, నిజాయితీని సీఐ శివప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు.